క్లుప్తంగా

చండప్రచండం



నిర్మానుష్యంగా రాచపల్లి అడ్డురోడ్డు జంక్షన్

ప్రత్తిపాడు రూరల్: సూర్యుడు గురువారం ఉగ్ర రూపం దాల్చాడు. ఏకంగా 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు కావడంతో ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు అల్లాడిపోయారు. అత్యవసర పనులు ఉంటే మినహా జనం బయటకు రాలేదు. ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానియాలను, పండ్ల రసాలను ఆశ్రయించారు. వాస్తవానికి వారం రోజులుగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌కు తగ్గకుండా నమోదవుతున్నాయి. ఇదే స్థాయిలో మరికొన్ని రోజులు నమోదయ్యే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

వనదుర్గ అమ్మవారికి నేడు హోమాలు

అన్నవరం: రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి వైశాఖ అమావాస్య సందర్భంగా శుక్రవారం ప్రత్యంగిర, చండీ హోమాలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకూ ఈ హోమాలు జరుగుతాయి. భక్తులు రూ.750 టికెట్టుతో హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. రామాలయం వద్ద బుకింగ్ కౌంటర్, వనదుర్గ ఆలయం వద్ద టికెట్లు లభిస్తాయని తెలిపారు.

ముగియనున్న నేరేళ్లమ్మ తల్లి జాతర

అన్నవరం గ్రామ దేవత నేరేళ్లమ్మ అమ్మవారికి పది రోజులుగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాలు శుక్రవారం ముగియనున్నాయి. ఈ సందర్భంగా జాతర, ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామంలో సాయంత్రం అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహిస్తారని అధికారులు తెలిపారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా

తుని: పట్టణంలోని పది వార్డులకు చెందిన ప్రజలకు శుక్రవారం నుంచి యథాతథంగా మంచినీటి సరఫరా జరుగుతుందని కమిషనర్ ప్రసాదరాజు గురువారం తెలిపారు. రేఖవానిపాలెం పంపుహౌస్‌లో చేపట్టిన ఒండ్రు మట్టి క్లీనింగ్ పనులు పూర్తి చేశారన్నారు. దీంతో ఒకటి నుంచి 10 వార్డులకు పూర్తి స్థాయిలో మంచినీరు సరఫరా చేస్తామని తెలిపారు. గతంలో మాదిరిగానే ప్రజలకు రెండు పూటలా నీటిని అందిస్తామన్నారు.

కౌలు కార్డులపై రైతులకు అవగాహన

కిర్లంపూడి: ప్రతి కౌలు రైతూ తప్పనిసరిగా గుర్తింపు కార్డు కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి జోకా అమృత అన్నారు. కౌలు కార్డు ఉపయోగాలపై గోనేడలో గురువారం రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కౌలు కార్డు కలిగి ఉన్న పంటను కౌలు రైతు పేరిట నమోదు చేస్తామని చెప్పారు. ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, ధాన్యం కొనుగోలుకు కౌలు కార్డులు తప్పనిసరని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారిని సంప్రదించి కొత్త కౌలు కార్డు పొందవచ్చని చెప్పారు. వైస్ సర్పంచ్ మోటేపల్లి గణపతి, వీఆర్‌ఓలు, సెక్రటరీ, వీఏఏ హరిత పాల్గొన్నారు.

కౌలు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

శంఖవరం: కౌలు పత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కౌలు రైతులకు వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. కౌలు రైతు గుర్తింపు కార్డులపై మండపం, శంఖవరం గ్రామాల్లో గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, కౌలు పత్రం వల్ల అసలు రైతుకు ఎటువంటి నష్టమూ ఉండదన్నారు. ప్రభుత్వ పథకాల్లో లబ్ధి పొందే విధంగా కౌలు రైతులకు ప్రభుత్వం వీలు కల్పించిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కూనిశెట్టి మాణిక్యం, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా దరఖాస్తు చేయాలి

తొండంగి: కౌలు రైతులందరూ తాము సాగు చేస్తున్న భూమి వివరాలను ఈ నెలాఖరులోగా గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు సమర్పించి, కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎస్.నరసింహం అన్నారు. ఎ.కొత్తపల్లిలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కౌలు రైతు కార్డుల దరఖాస్తు విధానంపై రైతుభరోసా కేంద్రాల వద్ద ఈ నెల 27 వరకూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. భూ యజమానుల హక్కులకు ఎటువంటి భంగం కలగకుండా ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలిచ్చిందని తెలిపారు. కేవలం పంట సాగుకు సంబంధించి మాత్రమే కౌలు రైతులను గుర్తించి, వారికి రుణ సహాయం, పంట బీమా, విత్తనాలు, ఎరువుల రాయితీ వంటి ప్రయోజనాలు మాత్రమే అందుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ కొప్పన దైవప్రసాద్, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కోడికి వడదెబ్బ

- అధిక ఉష్ణోగ్రతలకు కోళ్లు చనిపోతూండటంతో రైతుల నిరాశ
- పెరిగిన నిర్వహణ ఖర్చులు
- పెంపకానికి తాత్కాలిక విరామం



కోళ్లు లేక ఖాళీగా..



తొండంగి మండలం జి.ముసలయ్యపేటలోని కోళ్ల ఫారాలు

తొండంగి: నానాటికీ తీవ్ర రూపం దాలుస్తున్న ఎండలతో కోళ్ల పెంపకానికి వడదెబ్బ తగిలింది. తీర ప్రాంతం.. చల్లనైన వాతావరణం ఉండటంతో చాలా కాలం నుంచి కోళ్ల పెంపకాన్ని ఇక్కడి రైతులు పలువురు జీవనోపాధిగా మార్చుకున్నారు. అయితే, పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తాళలేక కోళ్లు చనిపోతూండటంతో కోళ్ల పెంపకానికి తాత్కాలికంగా విరామం ప్రకటించారు. దీంతో పలు ప్రాంతాల్లో కోళ్ల ఫారాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. మండలంలోని అద్దరిపేట, యర్రయ్యపేట, పంపాదిపేట, జి.ముసలయ్యపేట, వేమవరం, దానవాయిపేట, వాడముసలయ్యపేట, వాకదారిపేట, ఒంటిమామిడి, తాటియాకులపాలెం, పెరుమాళ్లపురం, కొత్తచోడిపల్లిపేట గ్రామాల మీదుగా దాదాపు 17 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. ఇసుక నేలలు కావడంతో ఇక్కడ జీడిమామిడి, కొబ్బరి, మామిడి, సరుగుడు తోటలను రైతులు అధికంగా సాగు చేస్తున్నారు. దీనివల్ల తీరం చల్లగా ఉండేది. ఇది అనుకూలంగా ఉండటంతో తీర ప్రాంతంలోని చిన్న, సన్నకారు రైతులు సొంతంగా తోటల్లో బ్రాయిలర్ కోళ్లఫారాలు ఏర్పాటు చేసి, జీవనోపాధి పొందుతున్నారు. మండలంలోని తీర ప్రాంతంలో దాదాపు 60 వరకూ కోళ్లఫారాలు ఉన్నాయి. ఒక్కో ఫారంలో నాలుగు నుంచి ఆరు షెడ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో షెడ్డులో 1,200 నుంచి 1,500 వరకూ కోడి పిల్లలను వేసి 45 నుంచి 60 రోజుల వరకూ పెంచి, అమ్ముకుంటున్నారు. ఇలా గతంలో ఏడాదికి ఆరు బ్యాచ్‌ల వరకూ వేసేవారు.

ఖాళీగా కనిపిస్తున్న కోళ్లఫారాలు

గతంలో వేసవిలో కోళ్లు చనిపోకుండా వాటరింగ్ ఏర్పాటు చేసేవారు. ఏటా వేసవిలో ఉష్ణోగ్రతలు పెరుగుతూండటంతో కోళ్లకు నానాటికీ గడ్డు పరిస్థితి ఏర్పడుతోంది. వాస్తవానికి కోళ్లు 40 డిగ్రీల సెల్సియస్‌కు మించిన ఉష్ణోగ్రతలు తట్టుకోలేవు. ప్రస్తుతం తీరంలో 45 నుంచి 47 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో కోళ్లు చనిపోతున్నాయి. ఫలితంగా నష్టాలు రావడంతో ఇక్కడి రైతులు కోళ్ల పెంపకానికి తాత్కాలికంగా విరామం ప్రకటించారు. దీంతో తీర ప్రాంతంలో పలు కోళ్లఫారాలు ఖాళీగా కనిపిస్తున్నాయి. తొలకరి వర్షాలు ప్రారంభమై, వాతావరణం పూర్తిగా చల్లబడితేనే కానీ కొత్తగా కోళ్లను వేయలేమని రైతులు చెబుతున్నారు.

కోడి మాంసం ధరకు రెక్కలు

ఓపక్క వేసవి ఎండల కారణంగా ఉత్పత్తి తగ్గగా.. మరోపక్క పెళ్లిళ్ల సీజన్ కావడంతో కోడి మాంసం వినియోగం పెరిగింది. దీంతో దీని ధరకు రెక్కలు వచ్చాయి. గతంలో కేజీ కోడి మాంసం ధర రూ.160 నుంచి రూ.180 వరకూ ఉండేది. ఈ ఏడాది రూ.250 నుంచి రూ.270 వరకూ పెరిగింది. వాతావరణం చల్లబడి కోళ్ల ఉత్పత్తి పెరిగితేనే కానీ మాంసం ధరలు తగ్గుముఖం పట్టే పరిస్థితి లేదని వ్యాపారులు చెబుతున్నారు.

వేసవిలో నష్టాలే..



ఒకప్పుడు ఏడాదంతా కోళ్ల పెంపకం చేపట్టే వాళ్లం. ఇప్పుడు వడదెబ్బ కారణంగా కోళ్లు అధికంగా చనిపోతున్నాయి. దీంతో పెట్టిన పెట్టుబడి రాకపోగా నష్టాలు చూస్తున్నాం. వాతావరణం చల్లబడితేనే కానీ కోళ్లను పెంచలేని పరిస్థితి.
– బి.రామారావు, కోళ్ల రైతు, జి.ముసలయ్యపేట

కోళ్ల పెంపకం నిలిపివేశారు



తీర ప్రాంత వాతావరణం అనుకూలంగా ఉండటంతో అధిక శాతం రైతులు కోళ్ల పెంపకాన్ని వృత్తిగా మార్చుకున్నారు. వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో కోళ్లు చనిపోతున్నాయి. దీంతో రైతులు రెండు మూడు నెలల పాటు కోళ్లను వేయడం లేదు. దీంతో ఉత్పత్తి బాగా తగ్గింది. – కె.శ్రీనివాస్, గ్రామ సచివాలయ వెటర్నరీ అసిస్టెంట్, జి.ముసలయ్యపేట

పశుగ్రాసానికి కొరత



ఏలేశ్వరంలో గడ్డి లేక అవస్థలు పడుతున్న పశువులు

ఏలేశ్వరం: ఎండల తీవ్రతతో పశుగ్రాసానికి కొరత ఏర్పడుతోంది. ఎండలకు భూముల్లో నీటి తడి అడుగంటి, గడ్డి పెరగని పరిస్థితులు నెలకొన్నాయి. దీనికితోడు పంట భూములను లే అవుట్లుగా మార్చడం వలన కూడా గడ్డికి కొరత ఏర్పడుతోంది. వరి కోతలు పూర్తయిన భూముల్లో పచ్చిరొట్ట వేయాల్సి ఉండగా వర్షాలు కురిసే సూచనలు లేక పోవడంతో రైతులు వెనుకంజ వేస్తున్నారు. గతంలో ఖరీఫ్ వేసే వరకూ పచ్చిరొట్ట, గడ్డి పెంచి, పశువులకు మేతగా ఉపయోగించేవారు. వర్షాలు కురిస్తేనే కానీ మేత దొరకని పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కౌలుదార్లకు అవగాహన సదస్సులు

గండేపల్లి: మండలంలోని సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాల్లో కౌలుదారులకు సాగు హక్కు చట్టంపై గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి మాట్లాడుతూ, కౌలుదారులు సాగు హక్కు పత్రం కలిగి ఉండాలని, తద్వారా వ్యవసాయ శాఖ రైతులకు అందించే సంక్షేమ పథకాలను భూ యజమానులతో పాటు కౌలుదారులు కూడా పొందే అవకాశం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ బాబా, ఉద్యాన సహాయకుడు జి.సాయి కిరణ్, వ్యవసాయ సహాయకుడు సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

బాలుడి వైద్యానికి రూ.14 లక్షలు

- మంజూరు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- చొరవ చూపిన ఎంపీ, ఎమ్మెల్యేలు



బాలుడి తండ్రికి ఆరోగ్యశ్రీ, పీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: అరుదైన వ్యాధితో బాధ పడుతున్న బాలుడి వైద్యానికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, పీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.14 లక్షలు మంజూరయ్యాయి. దీనికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు తదితరులు ఈ వివరాలు తెలిపారు. గోకవరం గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల బాలుడు అక్షయ్‌రామ్ బోన్‌మేరో సంబంధిత వ్యాధితో బాధ పడుతున్నాడు. అతడికి చికిత్స చేయించే స్తోమత తల్లిదండ్రులకు లేదు. దీంతో వారు ఈ విషయాన్ని వైఎస్సార్ సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.11 లక్షలు మంజూరయ్యేలా కృషి చేశారు. దీని ద్వారా మన రాష్ట్రంతో పాటు తెలంగాణ, తమిళనాడు, బెంగళూరులోని సుమారు 22 ఆస్పత్రుల్లో ఎక్కడైనా వైద్యం చేయించుకోవచ్చని వీరబాబు చెప్పారు. అలాగే కాకినాడ ఎంపీ వంగా గీత సహకారంతో ప్రధానమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3 లక్షలు మంజూరయ్యాయి. బాధిత బాలుడు అక్షయ్‌రామ్‌ను హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి ఎంపీపీ సుంకర శ్రీవల్లి ఆధ్వర్యంలో స్వయంగా తీసుకువెళ్తామని వీరబాబు తెలిపారు. అనంతరం ఆరోగ్యశ్రీ, పీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలను బాలుడి తండ్రి సతీష్‌కు అందజేశారు. తన కుమారుడి వైద్యానికి సహకరించిన ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్, ఎంపీపీ, స్థానిక నాయకులకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కర్రి సూరారెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, గుబ్బాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నరాలశెట్టి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే అందరి లక్ష్యం కావాలి

- ప్రగతికి సమన్వయంతో పని చేయాలి
- మండల సమావేశంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: మండలాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లి, ఆదర్శంగా తీర్చిదిద్దడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన జగ్గంపేటలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యుత్ సమస్యలు, ఈ–క్రాప్ బుకింగ్‌లో లోపాలు, జగ్గంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కొత్త పరికరాల అమరిక, పని చేయని సాంకేతిక పరికరాలు, పెండింగ్‌లో ఉన్న ఐసీడీఎస్ భవనాలు, పంచాయతీరాజ్ భవన నిర్మాణాల ప్రగతి, ఫిష్ ఆంధ్రా మినీ ఔట్‌లెట్ల ఏర్పాట్లు తదితర అంశాలపై ఆయన సమీక్షించారు. మల్లిసాల నుంచి జగ్గంపేట వరకూ ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని ఉన్న తుప్పల వల్ల పలు ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆక్వా సాగుకు అనుమతుల మంజూరులో ఎటువంటి అడ్డంకులూ లేకుండా చూడాలని మత్స్యశాఖ అధికారులకు సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని అన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు, ఎంపీపీలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో కొత్తగా భవనం నిర్మించి, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తెలిపారు. దీనిపై ప్రణాళిక సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఒమ్మి బిందుమాధవి, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీడీఓ హరికృష్ణ, తహసీల్దార్ శ్రీదేవి, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల పంపిణీ

కిర్లంపూడి: స్థానిక కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ అటల్ బూట్ క్యాంప్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు గురువారం ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. విజ్ఞాన్ ఆశ్రమమ్, యూనిసెఫ్, సేర్ట్, నీతి ఆయోగ్ సంస్థల ఆధ్వర్యాన ఈ నెల 15వ తేదీన పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లో నాలుగు రోజుల పాటు శిక్షణ నిర్వహించారు. ప్రాజెక్ట్ డాక్యుమెంటేషన్ అండ్ మెకానికల్ టూల్స్, క్యాడ్, త్రీడీ ప్రింటింగ్ పేపర్ ఒరగమి, బేసిక్ ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్స్‌పై పుణె విజ్ఞాన ఆశ్రమం నుంచి వచ్చిన నిపుణులు వెంకటేశ్, అవినాష్ శిక్షణ ఇచ్చారు. విద్యార్థులకు క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆకుల శ్రీనివాసరావు, జిల్లా అటల్ టింకరింగ్ ల్యాబ్ నోడల్ ఇన్‌చార్జి ఎం.కల్యాణ్ చక్రవర్తి, యూనిసెఫ్ రాష్ట్ర బృందం సభ్యులు టి.సుదర్శన్, దాడి గోవిందు పాల్గొన్నారు.

సత్యదేవుని సన్నిధానం.. దేదీప్యమానం



రాజగోపురం మెట్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు



ధగద్ధగాయమానంగా మెరిసిపోతున్న తూర్పు రాజగోపురం

అన్నవరం: కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలతో సత్యదేవుని సన్నిధి సరికొత్త కాంతుల్ని అద్దుకుంది. తూర్పు రాజగోపురం దిగువన గ్రానైట్ పలకలు అతికించిన మెట్లకు ఇరువైపులా విద్యుత్ దీపాల ఏర్పాటు మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ దీపాలను గురువారం రాత్రి వెలిగించారు. తూర్పు రాజగోపురం నుంచి దిగువన ఘాట్ రోడ్డు వరకూ గతంలో 103 రాతి మెట్లు ఉండేవి. ఒంగోలుకు చెందిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావు, రాజమహేంద్రవరానికి చెందిన జ్యోతి గ్రానైట్స్ అధినేత మన్యం ఫణి రూ.20 లక్షల విలువైన గ్రానైట్ విరాళంగా అందజేసి, మెట్లకు అతికించాలని కోరారు. అందుకయ్యే ఖర్చును కూడా వారే భరించారు. మెట్లకు ఇరువైపులా ఉన్న గోడలకు కూడా గ్రానైట్ పలకలు అతికించారు. మధ్యలో బూడిద రంగు, రెండువైపులా తెలుపు రంగు గ్రానైట్ రాళ్లతో ఈ మెట్లు చాలా ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆదేశాను సారం దాతల సహకారంతో రాజగోపురం నుంచి దిగువ ఘాట్‌రోడ్ వరకూ ఉన్న మెట్లకు ఇరువైపులా 206 ఎల్‌ఈడీ విద్యుద్దీపాలు ఏర్పాటు చేశామని దేవస్థానం విద్యుత్ శాఖ డీఈ టి.సూర్యనారాయణ తెలిపారు. దీంతో ఈ మెట్లు రాత్రి వేళ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. మెట్లు పూర్తిగా కనిపిస్తూండటంతో వాటిని ఎక్కేందుకు, దిగేందుకు భక్తులకు మరింత సౌలభ్యం ఏర్పడింది. ఈ ఎల్‌ఈడీ విద్యుద్దీపాలను కూడా శిద్దా రాఘవరావు, మన్యం ఫణి అందజేశారని సూర్యనారాయణ తెలిపారు.

సమస్యలు లేని గ్రామాలే లక్ష్యం

- ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్
- నెల్లిపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



మహిళకు సంక్షేమ పథకాల పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

శంఖవరం: సమస్యలు లేని గ్రామాలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత శ్రీపూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. నెల్లిపూడి గ్రామంలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత మూడేళ్లుగా ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎన్నికల హామీల అమలే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని అన్నారు. కరోనా కష్ట కాలంలోనూ వైఎస్సార్ రైతుభరోసా, జగనన్న అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ జలకళ వంటి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వివరించారు. రానున్న కాలంలో కూడా ఈ పథకాలన్నీ అమలు కావాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్వత రాజుబాబు, ఎంపీడీఓ జె.రాంబాబు, సర్పంచ్ నరాల శ్రీలత తాతబ్బాయి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్లకార్డులతో కమిషనర్ కొండలరావు, సిబ్బంది

ఏలేశ్వరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని మున్సిపల్ కమిషనర్ కొండలరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నగర పంచాయతీ కార్యాలయంలో గురువారం రిలీజ్, రెడ్యూస్, రీసైకిల్ (ఆర్‌ఆర్‌ఆర్) సెంటర్లను ప్రారంభించారు. ఆర్‌ఆర్‌ఆర్ లోగోతో పాటు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఈ నెల 17 నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకూ 15వ వార్డు కాలేజీ రోడ్డులో ఎంఆర్‌ఎఫ్ సెంటర్లను ప్రారంభించామని తెలిపారు. ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులను, ఇతర వస్తువులను ఈ సెంటర్లకు అందిస్తే ఆర్‌ఆర్‌ఆర్ ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ కె.శ్రీనివాసరావు, టీపీఓ ఆనంద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు

శంఖవరం: జి.కొత్తపల్లిలో పైడితల్లి అమ్మవారికి ఉపాధి హామీ కూలీలు, మహిళలు గురువారం పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంచారు. భజన బృందాలు భజనలు చేశాయి. కార్యక్రమంలో సర్పంచ్ ఈగల విజయదుర్గ, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈగల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంపై బీజేపీ అభియోగపత్రం

తుని: ప్రభుత్వం పలు అంశాలను అమలు చేయడంలో వైఫల్యం చెందిందని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు గురువారం సాయంత్రం పట్టణ పోలీసులకు అభియోగపత్రం సమర్పించారు. ఎస్సై మురళీమోహన్‌కు ఈ పత్రం అందజేసిన వారిలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వెలుగుల గోపాలకృష్ణ, ఆ పార్టీ తొండంగి, తుని మండల అధ్యక్షులు యాదాల రమణ, ప్రగడ అర్ధనారీశ్వరరావు తదితరులున్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు

గండేపల్లి: తాళ్లూరులో రామలింగేశ్వరస్వామి వారికి మాస శివరాత్రి సందర్భంగా గురువారం ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పదకొండు రకాల ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అభిషేకాలు, పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లయన్స్ సేవలు విస్తృతం

ఏలేశ్వరం: లయన్స్ క్లబ్ ద్వారా సేవలను మరింత విస్తృతం చేయనున్నామని లయన్స్ జిల్లా గవర్నర్ ఎం.ఉషారాణి అన్నారు. అధికారిక పర్యటనలో భాగంగా క్లబ్ సేవలను గురువారం ఆమె పరిశీలించారు. పనితీరును ప్రశంసించి గ్లోబర్ ప్రిన్స్ అలంకరించారు. ఆమెను క్లబ్ సభ్యులు సత్కరించారు. లయన్స్ జిల్లా కార్యదర్శి జానకి, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో
ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



జగనన్న కాలనీలో ఇళ్లను పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్

తుని రూరల్: పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తోందని, లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్లు నిర్మించుకుని, గృహ ప్రవేశాలు చేయాలని ఎంపీడీఓ విద్యాసాగర్ కుమార్ అన్నారు. హంసవరం, హెచ్.కొత్తూరు సచివాలయాల పరిధిలోని జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారని, ప్రభుత్వలే అవుట్లలో మంజూరు చేసిన నిధులతో ఇళ్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలని అన్నారు. లబ్ధిదారులకు భారం కాకుండా ఉండేందుకు ఉచితంగా ఇసుక, రాయితీపై ఇనుము, సిమెంట్ అందజేస్తున్నట్టు తెలిపారు. మంచి ముహూర్తాలు ఉన్నందున పనులు పూర్తి చేసిన లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రాయి పాపారావు, సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

తుని: పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగనుంది. ఈ విషయాన్ని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ కె.రత్నాలరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ఇండోర్ సబ్ స్టేషన్ నిర్వహణ, జీఎన్‌టీ రోడ్డు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని చెప్పారు. దీనివలన సాయినగర్, ఎంఆర్ పేట, ఫైర్ ఆఫీసు, రామా థియేటర్, గొల్ల అప్పారావు సెంటర్, నక్కిన వీధి, చేపల మార్కెట్, గరువు వీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదని వివరించారు.

టీడీపీ సమావేశం

ప్రత్తిపాడు: టీడీపీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం గురువారం పార్టీ ప్రత్తిపాడు కార్యాలయంలో జరిగింది. టీడీపీ మండల అధ్యక్షుడు అమరాది వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా 135 గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించామని, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకొని, వినతులు స్వీకరించామని చెప్పారు. ఈ వినతులను పార్టీ జిల్లా కార్యాలయానికి పంపుతామని తెలిపారు.

చురుకుగా ఇంటింటికీ కుళాయి పనులు

తుని రూరల్: ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసే పనులు లోవ కొత్తూరులో చురుకుగా జరుగుతున్నాయి. ఇప్పటికే నిర్మించిన వాటర్ ట్యాంక్‌కు బోరు బావి నుంచి పైపులైన్లను అనుసంధానం చేస్తున్నారు. ఈ పనులను సర్పంచ్ లంక వెంకటలక్ష్మి, ఎస్సీ సెల్ జిల్లా కమిటీ సభ్యుడు లంక కృపానందం గురువారం పరిశీలించారు. పైపులైన్ పనులు పూర్తయితే ఇంటింటికీ తాగునీటి కుళాయిలు అమర్చే పనులు చేపడతామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శివాజీ ఆధ్వర్యంలో జల్‌జీవన్ మిషన్ కింద ఈ పనులు చేస్తున్నామని తెలిపారు.

జాబ్‌కార్డులను సద్వినియోగం చేసుకోవాలి

తుని రూరల్: ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎ.అగ్రహారం సర్పంచ్ వరహాలబాబు, వల్లూరు, ఎ.అగ్రహారం ఎంపీటీసీ సభ్యుడు పెదకాపు తాతారావు అన్నారు. కొత్తగా మంజూరైన జాబ్‌కార్డులను లబ్ధిదారులకు వారు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అడిగినవారందరికీ ప్రభుత్వం ఉపాధి పనులు కల్పిస్తుందన్నారు. రోజు కూలి రూ.272 వరకూ చెల్లిస్తోందన్నారు. వేసవిలో చెరువుల్లో పూడిక తీత పనులు చేపట్టామని తెలిపారు. ఎ.అగ్రహారం, సీతయ్యపేటలకు కొత్తగా నియమితులైన ఫీల్డ్ అసిస్టెంట్ చొక్కా శిరీషకు ఇప్పటి వరకూ పని చేసిన ఎఫ్ఏ వరలక్ష్మి బాధ్యతలు అప్పగించింది. ఈ సందర్భంగా 16 సంవత్సరాల పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌గా సేవలందించిన వరలక్ష్మిని సర్పంచ్, ఎంపీటీసీ, స్థానిక నాయకులు, ఉపాధి కూలీలు సత్కరించారు. ఉపసర్పంచ్ పదిలం బాబూరావు, సచివాలయ కన్వీనర్ నాగస్నదొర పాల్గొన్నారు.